సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ఇక్కట్ల ప్రయాణం!

• పెరుగుతున్న రద్దీతో ప్రజల అవస్థలు • రహదారులను విస్తరించాలని వేడుకోలు



ఉదయం సమయంలో రద్దీగా గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారి

గోపాలపట్నం: గోపాలపట్నంలో జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. శివారు ప్రాంతాలు సైతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. అందుకు తగ్గట్టు రోడ్లు లేక పోవడంతో ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. రోడ్లను అభివృద్ధి చేయాలని విన్నవిస్తున్నారు.

సమన్వయ లోపమా!

రహదారి విస్తరణ ఏవిధంగా చేయాలి, పరిహారం ఎంత ఇవ్వాలన్న విషయాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు క్లారిటీ ఇవ్వాల్సి ఉందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి నగదు పారితోషికం లేదా టీడీఆర్‌లు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో కదలిక వచ్చింది. అభివృద్ధి చేసేందుకు సర్వే చేశారు. ఇంతలో కూటమి ప్రభుత్వం రావడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఆ ప్రతిపాదన నిలిచి పోయింది.

ప్రజల మొర వినరూ..

ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారికి ప్రత్యామ్నాయంగా తాటిచెట్లపాలెం పైప్‌లైన్ రహదారిని అభివృద్ధి చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. గతంలో మెటల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత రూ.38లక్షలతో బాజీ జంక్షన్ నుంచి ఆల్ఫా హోటల్ వరకు బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. పనులు ఎందుకు నిలిచి పోయాయో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు బాగు చేస్తే బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని అంక్షినగర్ రోడ్డు

చక్రం తిప్పుతున్న అక్రమార్కులు

ఈ రోడ్డును ఆనుకుని ఉన్న నివాసాలు, దుకాణాలతో పాటు ఆక్రమణల్లో టీడీపీ అనుచరులు, నాయకులు ఉండడంతో వారు చక్రం తిప్పి పనులు అడ్డుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ రహదారి అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేశారు. అధికారులు ఆక్రమణలపై సర్వే చేశారు. జీవీఎంసీ రూ. 5.5కోట్లు నిధులు కూడా మంజూరు చేసింది. కుమారి కల్యాణ మండపం నుంచి కొద్ది దూరం 80 అడుగుల రహదారి వేశారు. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.

ఓట్ల రాజకీయం

దశాబ్దాలు గడుస్తున్నా మాస్టర్‌ప్లాన్ రోడ్డు అందని ద్రాక్షగా మిగిలిపోయింది. మర్రిపాలెం వుడాలేఅవుట్ నుంచి గోపాలపట్నం వుడా లేఅవుట్ వరకు 80 అడుగుల రహదారి నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దాని ప్రకారం మర్రిపాలెం వుడాలేఅవుట్ నుంచి సంజీవయ్యనగర్ వరకు, ఏపీఎస్ఈబీ కాలనీ నుంచి సుసర్ల కాలనీ వరకు రోడ్డు వేశారు. ఆ తర్వాత రోడ్డు వేయకుండా నిలిపివేశారు. అప్పటి నుంచి పనులు ముందుకు సాగలేదు. ఎన్నికల సమయంలో మిగిలిన రోడ్డును అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి ఆ తర్వాత హామీని మరిచిపోవడం పరిపాటిగా మారింది.



బుచ్చిరాజుపాలెం తాటిపూడి పైప్‌లైన్ రహదారి దుస్థితి

కుదిస్తే ప్రయోజనం సున్నా



ఇందిరానగర్ రోడ్డును 80అడుగులుగా అభివృద్ధి చేయండి. ఇబ్బంది అనుకుంటే 60 అగుడులైనా చేయాలి. 40 అడుగులకు కుదిస్తే రోడ్డు వేసినా ప్రయోజనం ఉండదు. నాయకులు, అధికారులు ఆలోచించి ప్రజలకు ఉపయోగపడే విధంగా రోడ్డును అభివృద్ధి చేయాలి.

– దుర్గాభవాని, ఇందిరానగర్

బీఆర్‌టీఎస్‌కు ప్రత్యామ్నాయం



బీఆర్‌టీఎస్ రహదారికి తాటిపూడి పైపులైన్ రోడ్డు మంచి ప్రత్యామ్నాయం.దీన్ని అభివృద్ధి చేస్తే చాలా మేరకు ట్రాఫిక్ సమస్య తీరిపోతుంది. అధికారులు, నాయకులు ఈ రహదారుల అభివృద్ధికి కృషి చేయాలి.

–కె. వెంకటరమణ, బుచ్చిరాజుపాలెం

క్లుప్తంగా

మొక్కల పెంపకం అవశ్యం



విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న ధర్మానంద

మల్కాపురం: మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షించినప్పుడే మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని బౌద్ధ ప్రచారకుడు ధర్మానంద అన్నారు.61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలోని రామచంద్ర బౌద్ధరామం సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీహరిపురంలోని స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం అధికమైందని, ఆ ముప్పు నుంచి మానవుడికి కాస్తా విముక్తి కావాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌ల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మియాదవ్

మల్కాపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని స్థానిక నాయకురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మియాదవ్ అన్నారు. 61వ వార్డులోని జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ సమకూర్చిన స్పోర్ట్స్ కిట్‌లను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. క్రీడల్లో రాణిస్తే ఆరోగ్యంతో పాటు స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగాలు వస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి మాట్లాడుతూ చదువు వెలుగును ఇస్తే, క్రీడలు ఆరోగ్యంతో పాటు ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి సోమేష్,చంద్రమౌళి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రి అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు నాంది ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నాంది ఫౌండేషన్ సభ్యులు, కేసీ మహేంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యులు స్పోర్ట్స్ కిట్లు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, నాంది ఫౌండేషన్ పీవో సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఐసీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడి రాక

గోపాలపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ జాతీయ ఉపాధ్యక్షుడి(ఐసీఏఐ)గా ఎన్నికైన ప్రసన్న కుమార్ తొలిసారిగా శనివారం విశాఖ వస్తున్న నేపథ్యంలో విశాఖ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలకనున్నట్లు ఆయన సహచరులు తెలిపారు. ఐసీఏఐ బ్రాంచ్ సభ్యులు, సహచరులు, అభిమానులు విమానాశ్రయానికి రావాలని పిలుపునిచ్చారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి భక్తులను అలరించింది. విద్యార్థి మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.జగదాంబ ఆధ్వర్యంలో ఆమె శిష్య బృందం సీహెచ్.పల్లవి, వందన, టి.ఉష, ఎస్.సౌగంధి, సహస్ర త్యాగరాజకీర్తనలు ఆలపించి ప్రేక్షకులను పరవశింపజేశారు. మహా గణపతింభజేతో ప్రారంభించి, శ్రీసరస్వతి, శ్రీరామ పాదమా, సుధా మాధుర్య, నను గన తల్లీ, బాల త్రిపుర కీర్తనలు ఆలపించారు. వీరికి ఐవటూరి కృష్ణవేణి వయోలిన్‌పై, తాలడ చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు.

బ్యూటీషియన్ శిక్షణ తరగతులు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరమాండల్ సంస్థ డీజీఎం శ్రీనివాసరావు

మల్కాపురం: నేటి మహిళలు వంట ఇంటికే పరిమితం కాకూడదని, స్వయం ఉపాధి ద్వారా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్)రెడ్డిపల్లి శ్రీనివాసరావు అన్నారు. కోరమాండల్ సంస్థ సౌజన్యంతో మహిళలకు బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, అవసరమైన పరికరాల పంపిణీ చేశారు. జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌లోని సామాజికభవనం వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా రాణించాలనే ఆలోచనతో సీఎస్‌ఆర్ నిధులతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 45 రోజుల పాటు బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, సంస్థ డిప్యూటీ మేనేజర్ శేషపు వెంకటరమణ, ధర్మాల వేణుగోపాలరెడ్డి,శ్రీరామ్‌నగర్ గ్రామ పెద్దలు వల్లంశెట్టి శ్రీనివాస్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరులకు నివాళి



వీర మరణం పొందిన జవాన్లకు నివాళులర్పిస్తున్న మహాత్మాగాంధీ సేవా సంఘం ప్రతినిధులు

గాజువాక: పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఐస్టాండ్ ఫర్ నేషన్, జైభారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో అవయవాన్ని కోల్పోయిన వీర సైనికుడు షేక్ సుభాన్ జాతీయ జెండాను ఆవిష్కరించి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ల ప్రతినిధులు ఆదిల్, జి.టి.వి.రమేష్, వై.వి.శ్రీనివాసరావు, కిశోర్, బాటా శ్రీను, వినోద్‌బాబు పాల్గొన్నారు.

అమర జవాన్లకు అంజలి

కూర్మన్నపాలెం: పుల్వామా దాడుల్లో అమరులైన భద్రతా సిబ్బందికి నివాళులు అర్పిస్తూ మాజీ సైనికులు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. వారి మృతికి సంతాప సూచికంగా వడ్లపూడి ఆస్పత్రి నుంచి గాంధీ బొమ్మ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేసి జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. నర్సింగ్ సారథ్యం వహించగా 86వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్ సీపీ నాయకులు బొద్ద గోవింద్, సోమేష్, కె. శ్రీనివాస్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

కుల గణనతోనే బీసీలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు

సీతంపేట : రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బహిర్గతం చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారత చరిత్రలో బీసీలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కరువైందన్నారు. కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించామన్నారు. కులగణన ద్వారా మనమెంత, మన వాటా ఎంత అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి రాజ్యాధికారం సాధన దిశగా పయనిస్తామని తెలిపారు. బీసీ సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి బీసీల హక్కుల సాధన, ప్రాధాన్యం, రాజ్యాధికారం కోసం శ్రమిస్తామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సమన్వయ కమిటీ కన్వీనర్ పెదపెంకి శివప్రసాద్‌కు మద్దతు తెలపాలని సమావేశంలో తీర్మానించారు. అధికార ప్రతినిధి పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో కన్వీనర్ పల్లా వెంకట అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు

బీసీ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా కమిటీని సంఘం చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. కన్వీనర్‌గా పెదపెంకి శివప్రసాద్, అధికార ప్రతినిధిగా పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో కన్వీనర్లుగా సీహెచ్.శ్రీనివాసరావు, కాండ్రేగుల వెంకట ఉమా మహేష్, కొత్తూరు భాస్కరరావు, నూలు అభిరామ్, తమ్మిరెడ్డి మంగతాయారు, భీమశెట్టి విశ్వనాథం, పల్లా వెంకట అప్పారావు, కొమ్మోజు వెంకట సూర్యం, మహిళా కన్వీనర్‌గా జన్నెల అనుపమ, మహిళా కో కన్వీనర్‌గా పోతాబత్తుల ఆదిలక్ష్మి నియమితులయ్యారు. వీరంతా రాష్ట్ర కమిటీ ఆదేశాలను అనుసరిస్తూ బీసీ సమన్వయ కమిటీని విశాఖ జిల్లాలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రోగులతో సెక్యూరిటీ మర్యాదగా ప్రవర్తించాలి

మహారాణిపేట : వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులపట్ల సెక్యూరిటీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ సూచించారు.

ఆస్పత్రిలోని వార్డులను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక సెక్యూరిటీ గార్డు మద్యం సేవించి విధులకు హాజరైనట్లు గుర్తించి విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల కాలంలో ఆపరేషన్ థియేటర్లో థియేటర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో విచారించి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు, భద్రత కల్పించే విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఎఫ్.ఆర్.ఎస్ అమలు విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

నేడు కాలుష్యకారక వాహనాలు అనుమతించొద్దు

మురళీనగర్ : ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం నిర్వహించాలని విశాఖ జిల్లా స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం ఒక్క రోజు జీరో ఒమిషన్‌డేగా పాటించాలని, కాలుష్య కారక వాహనాలను కాలేజీ ప్రాంగణంలోకి తీసుకురాకుండా సహకరించాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలప్రిన్సిపాళ్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ముగిసిన వర్క్‌షాపు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న నావికాదళ సిబ్బంది

సింధియా: తూర్పు నావికాదళ పరిధిలోని పౌర సిబ్బంది కోసం ఐటీ దరఖాస్తులపై రెండు రోజులు పాటు నిర్వహించిన వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసింది. వర్క్‌షాప్‌లో ఎన్‌సీఎంఐఎస్, ఐగోట్ కర్మయోగి, స్పారో, స్పార్ష్, ఎన్ఐసీ మెయిల్ వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న సిబ్బంది సామర్థ్యాలను మరింత పెంచుకునే విధంగా ఇంటరాక్టివ్ సెషన్లు కూడా నిర్వహించారు.

తల్లిదండ్రులకు పాదపూజ



వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతి నగర్‌లోని రామకృష్ణా పాఠశాలలో శుక్రవారం తల్లి దండ్రుల పాద పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బి.రవీంద్రుడు సరస్వతీదేవి విగ్రహానికి పూల మాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. లక్ష్మీనళిని విద్యార్థుల తల్లి దండ్రులకు బొట్లు పెట్టారు. విద్యార్థులు పాదాలకు నమస్కరించి వారి ఆశీస్సులు పొందారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడె సుధాకరరావు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

ఘనంగా విజయదుర్గాదేవి పరస



పూజలందుకున్న దుర్గాదేవి

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం విజయదుర్గాదేవి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పరస నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు.సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పరసకు భక్తులు పోటెత్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు
- బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ సందర్శన



బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: దోమల నివారణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీతో పాటు పరిధిలోని లక్ష్మీనగర్ ప్రాంతంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత యూపీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి, ఓపీ, ఐపీ సేవలు, మందుల లభ్యతతో పాటు ఎన్‌సీడీ 3.0 సర్వే గురించి సంబంధిత అధికారులు,వైద్యులతో సమీక్షించారు. అభ ఐడీ మ్యాపింగ్ శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది అంతా ముఖ హాజరు విధిగా వేయాలని సూచించారు.

నీటి నిల్వలతో ముప్పు

ఫ్రైడే –డ్రైడే కార్యక్రమంలో భాగంగా లక్ష్మీనగర్‌లో డీఎంహెచ్‌వో విస్తృతంగా పర్యటించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. మంచినీటిలోనే డెంగ్యూ కారక దోమలు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. వారం రోజులకు మించి నీటిని నిల్వ చేయవద్దని సూచించారు. పరిసర ప్రాంత ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచి నీరు, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. సకాలంలో ఫాగింగ్ చేయాలని మలేరియా సిబ్బందికి సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని ప్రజలను కోరారు. సందర్శనలో వివిధ విభాగాల నోడల్ అధికారులు, డాక్టర్ హారిక, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయం



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

మహారాణిపేట : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు ఆదర్శనీయమని, ఆయన జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. సంజీవయ్య 104వ జయంతిని పురస్కరించుకుని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజానికి సంజీవయ్య అందించిన సేవలు శ్లాఘనీయమని పేర్కొన్నారు. సబ్బవరంలో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ ఉన్న విషయం మనందరికీ తెలిసిందేనన్నారు. మంచి పరిపాలనా దక్షత కలిగిన నేతగా ప్రసిద్ధిగాంచారని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, ఇతర అధికారులు సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్రానికి, దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీదేవి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్బీఐ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

28 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, రైల్వే భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన అనుర్బ సర్కార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, ఆజంగఢ్‌కు చెందిన జె.వర్మ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 28 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

సీతమ్మధార: ఝార్ఖండ్ రాష్ట్రం, పలము జిల్లాలోని బండువ గ్రామానికి చెందిన సంజయ్ (55)ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్నేళ్ల కిందట భార్యతోపాటు సోదరుడు కాలం చేయడంతో సంజయ్ మానసికంగా కుంగిపోయాడు. అదే సమయంలో కుటుంబ పోషణ కోసం కొడుకుతో కలిసి పనికోసం బయలుదేరాడు. అప్పటికే మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో వైజాగ్‌లో తప్పిపోవడంతో ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో వైద్యం అందించారు. ఇటీవల కోలుకోవడంతో వివరాలు సేకరించి స్వస్థలానికి తీసుకెళ్లి కోడలు సుఖ్నీదేవికి అప్పగించామని సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పోలీసు క్వార్టర్లను సందర్శించిన సీపీ



త్రీ టౌన్ పోలీసు క్వార్టర్లు పరిశీలిస్తున్న సీపీ

మద్దిలపాలెం: మూడో పట్టణ పోలీసు స్టేషన్ క్వార్టర్లను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ శుక్రవారం సందర్శించారు. ఆ క్వార్టర్లలో నివాసం ఉంటున్న సిబ్బంది కుటుంబ సభ్యులతో మాట్లాడి, స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో 3వ పట్టణ పోలీసు స్టేషన్ వద్ద గల పోలీసు క్వార్టర్స్‌ను సందర్శించిన సీపీ పోలీసు కుటుంబ సభ్యులు కోరిన మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ పనులు పూర్తవడంతో వాటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను సత్వర సమయంలో పరిష్కరించిన నగర పోలీసు కమిషనర్‌కు పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. క్వార్టర్స్‌లో ఇంకేమైనా సమస్యలున్నాయా అని సీపీ ఆరా తీశారు. వారు తెలిపిన సమస్యలు సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏ సమస్య ఉన్నా తాము ఇచ్చిన 79950 95799 నంబరుకు తెలియపరచాలని పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com